# కామెడీ కథ

డా.కొఠారి వాణీ చలపతిరావు

# మా అమృతం వంట

నేను భోజన ప్రియుడ్ని! మా ఆవిడ పాకశాస్త్ర ప్రియురాలు! 'బాగుంది జోడీ...'! అనో 'ఈ మొగుడుగాడు లక్కీఫెలో' అనో మీరు అనుకుంటే పప్పులో కాలేసినట్టే లెక్క! ఎందుకంటే 'మా ఆవిడ పాకశాస్త్ర ప్రియురాలు' అన్నానుగానీ 'ప్రవీణురాలు' అనలేదు గనుక! సాధారణ వంటలతో ప్రతిరోజూ..స్పెషల్ వంటకాలతో అడపాదడపా నా నోటికి చేయని నేరానికి శిక్ష విధిస్తూ నా జిహ్వా చాపల్యానికి ఏకంగా మరణ దండనే విధించింది మా ఆవిడ. 'ఈరోజు ఏం వంట చేసిందో, అది ఎలా తగలడిందో?' అని అనుకుంటూనే బితుకు బితుకు మనుకుంటూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాను.

అప్పటికే మూడుసార్లు ఫ్యాక్టరీ సైరన్ కూతలా "త్వరగా రండి...వేడివేడిగా తిందాం. ఆలస్యం చేస్తే చల్లారిపోతాయ్" అని పిలిచింది మా ఆవిడ ఉరఫ్ అమృతం.

'వంట', 'తిండి'కి సంబంధించిన విషయాల్లో 'వేడివేడిగా..' అనేది మా ఆవిడ రోజుకు ఏ ఐదారు సార్లో వాడే ఊతపదంలాంటిది.

"కాఫీ చల్లారిపోతుంది. వేడివేడిగా తాగండి" అంటుంది పొద్దున్నే.

ఇడ్లీనో దోశనో ప్లేట్‌లో పెట్టి "వేడివేడిగా తినండి..ఇలా ప్లేటులో వేయగానే..అలా చల్లారిపోతాయి" అంటుంది బ్రేక్‌ఫాస్ట్ టైములో.

దోశ అయితే పెనం మీద నుంచి డైరెక్ట్‌గా నోట్లోకి వెళ్ళిపోతేనే..దాని రుచి నోటికి తగులుతుందట. ఇడ్లీ కూడా ఇలా కుక్కర్‌లోనుంచి అలా నోట్లోకి వెళ్ళిపోవాలట స్పీడ్‌గా. ఒకరోజు ఇలాగే ఉప్మా ప్లేట్‌లో పెట్టి "ఊ..తినండి త్వరగా ఊ!" అని తరుముతుంటే హడావుడిగా..గబగబా స్పూన్ నోట్లో పెట్టుకుని..అది అసలే పేస్ట్‌లా ఉండటంతో 'గమ్'లా నోటికి అంటుకుపోయి 'స్స...స్స..స్స...స్స..స్స...' అని మ్యూజిక్ ఇస్తూ డ్యాన్సు కూడా చేసాను కాలిన బాధతో విలవిలలాడుతూ.

దాంతో నోరంతా పొక్కిపోయి ఐదారు రోజులు ఏమీ తినలేక అర్ధాకలితో కడుపుమాడ్చుకున్నాను.

అలా ఆ ఒక్కరోజే కాదు..వేడి వేడి అన్నంతో ఒకసారి వేడివేడి సాంబారుతో మరోసారి, టమాటా సూపు, ఉల్లిపాయ పకోడీలతో ఇంకెన్నోసార్లు..ఇలా ఆల్‌మోస్ట్ ప్రతిరోజూ నా మూతిని, నాలుకను కాల్చుకుంటూనే ఉన్నాను.

అందుకే మా ఆవిడ వంట అంటే నాకు అదో రకం ఫోబియో.. దినదినగండం అంటే ఏమిటో ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాను. దీనికి ఈ వంటల పిచ్చి ఏమిటో..దాంతో రోజుకో ప్రయోగం ఏంటో..నా జిహ్వా చాపల్యాన్ని పగపట్టి ఇలా ప్రతిరోజూ ఖూనీ చెయ్యడం ఏంటో నాకు అర్ధం కాదు. డైనింగ్ రూమ్‌లో డిన్నర్ సెట్‌లు, గాజుగిన్నెలు, గ్లాసుల కోసమని అందరూ అలమారా చేయించుకుంటారు. కానీ మా అమృతం మాత్రం మాలతీ చందూర్ 'వంటలు..పిండివంటలు' పుస్తకం మొదలుకుని ఇప్పుడు లేటెస్ట్‌గా వచ్చిన అనేక వంటల పుస్తకాలు పెట్టుకోవడం కోసం ఓ అలమారా ప్రత్యేకంగా చేయించుకుంది.

సెక్షన్‌లు, పీనల్ కోడ్‌లు రిఫర్ చేసుకోవటానికి లాయర్ల ఇళ్ళలో లా పుస్తకాలు ఎలా ఉంటాయో అలా ఎప్పటికప్పుడు ఏ వంటలో ఏఏ పదార్థాలు వేయాలో, వాటి పాళ్ళు ఎంతో.. రిఫర్ చేసుకోవటానికి ఆ పుస్తకాలను అలమారాలో వరసగా పేర్చి పెట్టిందన్నమాట. పై వరసలో ఉన్న వాటిని చెక్కబల్ల వేసుకుని ఎక్కి తీసి మరీ రిఫర్ చేస్తుంటుంది. ఇంత కష్టపడి...అంత ఆసక్తిగా చేసిన వంటలు పోనీ రుచిగానయినా ఉంటే, తినటమే పనిగా..'మూడు పదార్ధాలు-ఆరు రుచులు' అన్నట్టుగా భుక్తాయాసంతో త్రేన్చుతూ డైనింగ్ టేబుల్ ముందు నుంచి లేచేవాడిని.

అంత అదృష్టమా ఈ జన్మకు!

"ఏంటి ఆలోచిస్తున్నారు..తినరేం వేడివేడిగా? చల్లారిపోతుంటే కనబడటంలా?" అని మా ఆవిడ గదమటంతో ఈ లోకంలోకి వచ్చి ప్లేట్‌లోని నల్ల రంగు పదార్ధం వంక, ఎర్ర రంగుతో డేంజరస్‌గా కనబడుతున్న మరో పదార్ధం వంక భయం..భయంగా చూసాను.

నల్లరంగు పదార్ధాన్ని కాకరకాయ కూర అని, ఎర్రరంగు పదార్ధాన్ని దిట్టంగా కారం వేయబడిన దోసకాయ పప్పు అని, పక్కన గిన్నెలో పొగలు కక్కుతున్న నీళ్లలాంటి ద్రవపదార్ధాన్ని 'చారు' అని మా ఆవిడ చెబితేగానీ నాకు అర్థమయి చావలేదు. మా ఆవిడ భాషలో చెప్పాలంటే నాది మట్టిబుర్ర! రుచీ, పచీ లేని చప్పిడి జీవితం నాది! పాకశాస్త్రంలో చెప్పిన షడ్రుచులనూ ఒక్కదాన్నీ ఏ ఒక్కరోజూ మిస్ కానివ్వకుండా తన వంటలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నాకు షడ్రసోపేతమయిన భోజనం తినిపించ తలపెట్టే పతివ్రతామతిలకం అయిన మా ఆవిడకు నేనలా కనిపించటం సహజమే మరి! ఇనప గుగ్గిళ్ళు వండిపెట్టిన సతీ అనసూయ. సాక్షాత్తూ మా ఆవిడ రూపంలో మా ఇంట వెలిసిందేమో అనుకుంటుంది...పాకశాస్త్రాన్ని పట్టుదలతో గట్టిగా చదివి సరికొత్త ప్రయోగాలను చేస్తున్న మా ఆవిడను చూస్తుంటే. నోరు మూసుకుని (అంటే నిశ్శబ్దంగా అని అర్ధం) భోజనం చేస్తున్న నన్ను 'కాకరకాయ వేపుడు ఎలా ఉంది?' అని అడిగింది అమృతం.

మా ఆవిడకు ఇదో జబ్బు! అంటే అలవాటు! వంట చేసి నా ముందు పెట్టి..ఎలాగోలా తంటాలు పడి నేను తింటుంటే తిననివ్వకుండా 'ఎలాగుంది?' అని అడుగుతుంది. అలా అడగటంలో ఆమె ఉద్దేశం నేను 'చాలా బాగుంది!' 'సూపర్!' 'వెరీ వెరీ టేస్టీ..' 'ఏదీ ఇంకొంచెం వడ్డించు!' అంటూ ఆమె వంటను పొగడాలనీ..అది విని ఆమె పొంగిపోవాలనీ!

బహుశ ఆడవాళ్ళు అందరూ వాళ్ళ భర్తల నుంచి ఇలాగే ఆశిస్తారేమో! వాళ్ళూ తెగ పొగిడేస్తారు కాబోలు!

కానీ నాకు మాత్రం వట్టిగా 'బాగుంది' అనటానికి కూడా నోరు రాదు. తప్పనిసరి పరిస్థితిలో తల ఊపటమో, మరేదోనో చేస్తాను. ఆ రోజూ అలాగే చేస్తే-

"గంగిరెద్దులా ఏంటా తల ఊపటం? నోటితో చెబితే నోటిముత్యాలు రాలిపోతాయా?" అంది అమృతం.

"ముత్యాలు కాదు, నోటినుంచి అన్నం ముద్ద జారిపోతుంది. సీరియస్‌గా తింటుంటే తిననివ్వవేం?" అన్నాను.

'సీరియస్'గా అన్న ఆ మాటను నేనో అర్ధంలో అంటే ఆమె మరో అర్ధంలో తీసుకుని "తినండి..తినండి..అయితే! ఇంకొంచెం వడ్డించుకోండి..సారీ ఫర్ ది డిస్టబెన్స్!" అంటూ మరో గరిటెడు కంచంలో వడ్డించింది పట్టలేని ఆనందంతో.


నా మౌనాన్ని ఆమె వ్యతిరేకార్ధంలో కాక, నానా అర్ధాలుగా తీసుకుంటున్నట్టు ఆమె ముఖంలో మారుతున్న హావభావాలు నాకు చెప్పక చెప్పాయి.

కాలకూటవిషంలా ఉన్న కాకరకాయకూర మా అమృతం కళ్ళకు 'నా పాలిట అమృతం'లా కనిపించింది.

కళ్ళవెంట నీళ్ళు తెప్పించే కారం మంటతో కూడుకుని ఉన్న ముక్క ఉడకని దోసకాయ పప్పు ఆమె కళ్ళకు కమ్మని పదార్ధంగా కనిపించింది. ఈ మాట ఎందుకంటున్నానంటే వంట ఎప్పుడూ చుర్రుమనే కారంతో 'హా..హా' అంటూ హాహాకారాలు చేస్తూ తినేలా ఉంటేనే అందులో కమ్మదనం ఉంటుందన్నది మా ఆవిడ నిశ్చితాభిప్రాయం. పులుపూ అంతే ఉండాలంట! నాలుకను అంగిలి కానించి - కళ్ళు మూసి..వింత శబ్దాలు చేస్తూ పులుసన్నం తింటేనే 'మజా'నట!

ఆరోజు చారే అయినా అదీ పుల్లగానే ఉంది. చింతపండు ఎక్కువ వేయటంతో! పైగా "వేడి చారు-వేడి చారు..పోసుకోండి" అంటూ వీరావేశంతో కంచంలో బదులు నా చేతిమీద పోస్తే






"అబ్బా!" అని నేను ఆర్తనాదం చేసాను ఇల్లెగిరిపోయేలా.

"నీ వేడివేడి పిచ్చి పాడుగాను. చంపుతున్నావే నీ వేడి వంటకాలతో ఓరోజు నా నోరు, మరో రోజు చెయ్యి కాల్చి" అన్నాను కాలిన చెయ్యిని 'ఉఫ్-ఉఫ్'మని ఊదుకుంటూ.

"చారు పోస్తున్న సమయానికి మిమ్మల్ని చెయ్యి అడ్డంపెట్టమని నేను చెప్పానా? ఆ మాత్రం చూసుకోనక్కర్లా? అయినా చెయ్యి కాల్తుందనో, నాలుక చుర్రు

## భలే స్నేహం

*రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఎవరూ వుండరని ఎలా చెప్తారో సినిమా ఇండస్ట్రీలో కూడా దాదాపు అదే పరిస్థితి వుంటుందని అంటారు బాలీవుడ్ జనాలు. అయితే ఇటీవలి కాలంలో ఫ్రెండ్‌షిప్‌కి మరో పేరుగా బాలీవుడ్ అంతటా ప్రచారాన్ని పొందారు కరీనా కపూర్-అమృతా అరోరా. వీళ్లిద్దరూ డైటింగ్ చేయడం దగ్గర నుంచీ చాలావరకు విషయాల్లో ఒకే పద్ధతిలో ముందుకెళుతున్నారట. ఇద్దరి డైటీషియన్ ఒకరేనట. అలాగే ఇద్దరూ దూరంగా వున్నప్పుడు తెగ ఫోన్లు చేసుకుంటారట. నిమిష నిమిషానికి ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ సినీ జనాల్ని విస్మయపరుస్తున్నారట. ఈ 'దోస్తీ' ఎంత కాలమో!*



మంటుందనో, వేడివేడిగా కారం కారంగా తినకుండా చల్లారిన చారుతో, చప్పిడి పప్పుతో అన్నం తింటారా ఎవరయినా? అలాగయితే చారు బదులు ఇన్ని నీళ్ళు పోసుకుని, ఇంత ముద్దపప్పు వేసుకుని తినండి. అది మీకు సరిపోతుంది. నాకు శ్రమ తగ్గుతుంది. దేనికయినా పెట్టి పుట్టాలి. రుచిగా వండి వడ్డించే పెళ్ళాం దొరకటం నా అదృష్టం అనుకోకుండా ఉల్టా నామీద రంకెలేస్తారేంటి?" అంటూ నా నోరు మూయించింది అమృతం. నేతిబీరకాయలో నెయ్యిలా పేరులో తప్ప..వంటలో అమృతం లాంటి రుచి ఏనాడూ ఏ కోశానా లేని తను అలా మాట్లాడుతుంటే ఇంక నేను ఏమననూ? నోరు మూసుకుని..అదే 'మౌనంగా' పెట్టింది తిని..బ్రతికుండటానికి ఏదో ఒకటి తినక తప్పదు..అని నిట్టూర్పులు విడుస్తూ జీవితాన్ని లాగించేయటం తప్ప.

* * *

'ఈరోజు స్పెషల్' అని హోటల్ ముందు బోర్డు పెట్టినట్టు దాదాపు మా అమృతం కూడా ప్రతిరోజూ ఏదో ఒక చిన్నా చితకా స్పెషల్ వంటకం చేస్తూ ఉంటుంది. నిజంగానే అది అందరూ చేసేదానికన్నా 'స్పెషల్'గా ఉంటుంది.

ఈరోజు సేమ్యా పాయసం చేసింది. తక్కువ పాలతో ఎక్కువ ఉడికించడంతో సేమ్యా ఉప్మాలాగా ముద్దకట్టుకునిపోయి బంకలా నోటికంతా అంటుకోవడం మొదలుపెట్టింది.

"వొద్దు మొర్రో" అంటే వినదు.

"తినండి..తినండి" అని చంపుతుంది. దీని పతిభక్తి కూల!

"బోలెడు చేసాను. వేస్ట్ అయిపోతుంది. పట్టిగా పారేసుకుంటే ఏమొస్తుంది" అని తను అన్నాక అప్పుడు తెలిసింది మరో కొత్త విషయం!

'వేస్టు అయిపోతుందని, బయట పారేయాల్సి వస్తుందని అనుకున్న పదార్థాలను కూడా బలవంతంగా నా పొట్టలో పోయిస్తుందని! ఇలా రోజుకు ఎన్ని పదార్థాలు నా పొట్టలో పడిపోతున్నాయో...ఇదొక చెత్తకుండీ అయిపోయింది ఈమె దృష్టిలో' రోషం తన్నుకొని వచ్చింది లోనుంచి.

ఇక నుంచి ఈవిడ ఏ గడ్డి పెడితే ఆ గడ్డిని అమాయకంగా తినేయకూడదు. 'చస్తే తినను. అని నిరాహార దీక్ష చేయాలి' అనుకున్నాను ఖచ్చితంగా.

రెండు రోజులు అలాగే చేసాను.

మూడోరోజు కడుపుమండింది ఆకలితో.

ఈ ప్రపంచంలో దేన్నయినా జయించగలం గానీ ఆకలిని జయించలేమన్న నిజాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అదీగాక రోజూ ఉండే ఇల్లు..వండిపెట్టే పెళ్ళాన్ని కాదని ఎక్కడికి వెళ్ళగలను. వెళ్ళినా ఎల్లకాలం నాకు తిండెవరు పెడతారు. అందుకే రాజీకి వచ్చి ఉన్నదాంతో ఎడ్జస్ట్ అయి అర్ధాకలితో పొద్దుపుచ్చక తప్పలేదు నాకు.

* * *

మా ఆవిడ వంట జగత్ప్రసిద్ధం కనుక సామాన్యంగా మా ఇంటికి అతిథులు ఎవ్వరూ రారు. ఒకసారి తెలియక వచ్చినా ఇంకోసారి మాత్రం ఖచ్చితంగా రారు.

ఆ రోజు మా మామయ్య..మాత్రం..ఆయన ఖర్మకాలి మా ఇంటికి అతిథిగా వచ్చాడు.

నా గుండె పీచు పీచుమంది.

మా ఆవిడమాత్రం తన చేతి వంట తినడానికి ఒక శాల్తీ దొరికినందుకు తెగ ఆనందపడిపోయింది. రెచ్చిపోయి వంటలు చేసింది. రోజూ రెండు, మూడు స్పెషల్స్!

ఒక్కటయినా నోట్లో పెట్టుకోవడానికి వీలుగా ఉంటేనా!

నిజానికి మా ఆవిడ వంట నైపుణ్యం..వచ్చీరాగానే మా అతిథి దేవుడికి ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లోనే తెలిసిపోయింది.

"ఇడ్లీలు చల్లారిపోతాయి. త్వరగా టిఫిన్‌కి రండి బాబాయిగారూ! వేడివేడిగా తిందురుగాని" అంటూ మొదలుపెట్టింది.

ఆయన స్నానం చేసి..పంచెకట్టుకుని...వచ్చి టేబుల్ ముందు కూర్చున్నాడు. మామయ్య కూడా నాలాగే భోజన ప్రియుడు

కావటం..అందులోనూ అతిథి మర్యాదల తాలూకు హయ్యర్ ఎక్స్‌పెక్టేషన్స్ కూడా ఉన్నవాడు కావటంతో ఉబలాటంగానే వచ్చాడు ముందు! ప్లేట్‌లోని ఇడ్లీ ఒక్కముక్క తుంపి నోట్లో పెట్టుకుని 'అబ్బా' అని ఒక్కకేక పెట్టి పన్నును అరచేతిలోకి తీసుకుని చూసి బిక్కముఖం వేసాడు...అప్పటికప్పుడు.

"ఏమయింది బాబాయిగారూ..అయ్యో పన్ను ఊడిందా...అంత వీకా మీ పళ్ళు? డాక్టర్‌కు చూపించుకుని పీకించుకోక అలాగే అట్టిపెట్టుకున్నారా?" అంది మా ఆవిడ అసలు విషయం గ్రహించలేక!

మా ఇంట్లో ఇడ్లీలు గట్టిగా రాళ్ళలా ఉంటాయి. గట్టిపళ్ళకే గతిలేదు. ఇక ఊగుడు పళ్ళకు గ్యారంటీ ఎవరిస్తారు?

"ఇడ్లీలు కాస్త గట్టిగా ఉన్నాయమ్మా" అన్నారు మామయ్య మొహమాటానికి పోకుండా ఉన్న విషయం చెబుతూ.

ఆ విమర్శను మా ఆవిడ ససేమిరా అంగీకరించలేదు వోవర్ కాన్ఫిడెన్స్‌తో.

"కొంచెం గట్టిగానే ఉండాలి బాబాయిగారూ! అలా ఉంటేనే పర్ఫెక్ట్‌గా కుదిరినట్టు! మెత్తగా ఉంటే స్పాంజ్‌లా తయారయి నోట్లో వేసుకోగానే గొంతులోకి వెళ్ళిపోయి ఇడ్లీలు తిన్న ఫీలింగ్ రాదు" అని అడ్డంగా వాదించింది.

ఇంకేం మాట్లాడతాడు ఆ మహానుభావుడు!

"ఓ కప్పు కాఫీ ఇవ్వు లేమ్మా..చాలు! ఇడ్లీలు వద్దులే!" అని ప్లేటు పక్కకు జరిపి కూర్చున్నాడు. అది చూసి -

'అమాయకుడు! కాఫీతోనయినా కడుపునింపుకుందామనుకుంటున్నాడు' అని నాలో నేనే ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాను.

కాఫీ వచ్చింది. షుగరు, పాలూ రెండు సరిపోని ఆ కాఫీ కటిక చేదుగా వుంటుందని తెల్సు నాకు. అదేమంటే 'కాఫీ అలా స్ట్రాంగ్‌గా ఉంటేనే బాగుంటుందని' వాదించి తన మాటే నెగ్గించుకుంటుంది మా అమృతం. ఆ విషయం బాగా తెలిసిన నేను, అప్పుడే కొత్తగా తెలుసుకున్న మామయ్య ఇద్దరం మళ్ళీ నోరెత్తితే ఒట్టు!

మా ఆవిడ వంట గురించి అప్పటికే అర్థమైపోయిన మామయ్య ఈ ఇంట్లో...ఈ అర్భకుడు ఇంకా ప్రాణాలతో ఎలా ఉన్నాడు అన్నట్టు జాలితో నా వంక చూడబోయి అప్పుడే సీరియస్‌గా నేను ఇడ్లీ తింటున్న తీరు చూసి దంగయిపోయాడు. ప్లేటులో పెట్టిన రెండు ఇడ్లీలను ఐదువేళ్ళు, అరచెయ్యితో ఒక పట్టు పట్టి గట్టిగా పిసికేసి..అందులో ఓ పెద్దగిన్నెడు సాంబారు పోసేసి మునివేళ్ళతో జుర్రుకొని తింటున్న నా తిండితీరు చూసాకగానీ మా ఆవిడ చేతివంట తింటూ నేనింకా క్షేమంగా ఎలా ఉన్నానో ఆయనకు బోధపడలేదు. అది బోధపడ్డాక 'మరి మా ఆవిడ కూడా ఇలాగే తిని బతుకుతోందా?' అన్న సందేహం కూడా ఆయనకు వచ్చే ఉంటుంది. ఎందుకంటే ఆవిడ తినేది కూడా అదే తిండి కదా! 'కాకి పిల్ల కాకికి ముద్దు' ఎందుకు ఎలా? అంటే ఏం చెబుతాం..మాతృప్రేమ! మా ఆవిడకు తను వండే వంటల మీదా అలాంటి వాత్సల్యమే!

ఆయన సందేహానికి సమాధానం ఎలాగూ లేదు గనుక నివృత్తి చేయాల్సిన అవసరం ఏముందిలే అనుకొని ఏదో మాటల్లో పెట్టడం కోసం నేనే అన్నాను.

"మా ఆవిడ పేరు అమృతం. ఆమె వంట మరింత అమృతం అని ఈపాటికి నీకు తెలిసిపోయే వుంటుంది కదూ మామయ్యా. మా అత్తగారి చేతి వంట నువ్వు తినలేదు గానీ...పెళ్ళయిన కొత్తలో నేను నాలుగైదుసార్లు తిన్నాను. అమ్మో అఖండురాలు ఆమె..ఇనపగుండ్లను కూడా గుగ్గిళ్ళుగా వండగల దిట్ట. 'గింజలు ఉండగా ఇనపగుండ్లను ఎందుకు వండటం?' అని అడక్కు అదో టైపు..అదో స్పెషల్ వంటకం.." అని నేను అంటుంటే చెవులు ఒప్పగించుకుని విన్నాడు మామయ్య ఆసక్తిగా. ఆశ్చర్యంగా, మా అమృతం మాత్రం అదంతా పొగడ్తే అనుకుని..పొంగిపోయి మురిసి ముక్కలవుతోందని ఆమె చిరునవ్వు ముఖం చూస్తే నాకు అర్థమైపోయింది.

అతిథిమర్యాదలో భాగంగా లంచ్‌లో మా ఆవిడ మామయ్యకోసమని ప్రత్యేకంగా మిరపకాయ బజ్జీలు, సగ్గుబియ్యం పరమాన్నం చేసింది.

కారం కారంగా..వేడి వేడిగా వడ్డించి 'వెంటనే తినమని' ఆయన్ని అదే పనిగా వేధించింది. అసలే మిరపకాయ బజ్జీల నసాళానికంటే కారం మంటతో రొప్పుతూ అవస్థపడుతున్న మామయ్య నోటికి..పొగలు చిమ్ముతున్న పరమాన్నం వేడి తగలగానే మంటమీద మంట పెడబొబ్బలు పెట్టేలా చేసింది. దాంతో సంచీ చేతబట్టుకుని "నాకు అర్జంటు పనుందిరా వెళ్ళాలి" అంటూ పరుగులంకించుకున్నాడు.

## పాపం ప్రియాంక!

తన తాజా సినిమా '**లవ్ స్టోరీ 2050**' బాక్సాఫీసు దగ్గర బాంబులా పేలిపోవడంతో ప్రియాంకా చోప్రా ఒక్కసారిగా నీరుగారిపోయిందిట. మరీ అంతగా ఫ్లాపవుతుందని అనుకోలేదు మరి. అందుకనే ఏమో ఆమె కొత్త సినిమా 'ద్రోణ'కి సంబంధించిన తొలి పబ్లిసిటీ ట్రయిలర్లలో ప్రియాంకా లేకుండా విడుదల చేసారు నిర్మాతలు. అదేంటీ మరీ అలా అని కొంతమంది ఆరాతీస్తే- అబ్బే.. రాబోయే ప్రమోస్‌లో ప్రియాంకా సీన్లు కూడా వుంటాయి అని సర్దుతున్నారట నిర్మాతలు. అంతే లెండి... దేనికైనా టైమ్ బాగుండాలిగా.



"సాయంత్రం స్నాక్స్‌లా తింటారని తెప్పాలాచెక్కలు చేసాను బాబాయిగారూ ఓ రెండు ఇవయినా తిని వెళ్ళండి" అని చేతిలో ప్లేట్‌తో సహా ఆయన వెంట పడింది అమృతం.

"అమ్మో! తెప్పాలా చెక్కలే! వద్దు నీకు పుణ్యం వుంటుంది వద్దు" అని పెద్దగా అరుస్తూ నోట్లో మిగిలిన ఆ నాలుగు పళ్ళనూ 'ఉన్నాయా..లేదా' అన్న అనుమానంతో బుగ్గలు నొక్కుకుని తడిమి చూసుకుంటూ ఇంటిబాట పట్టాడు మామయ్య.

దొరికిన ఒక్క బకరా తప్పించుకుని అలా పరుగెత్తడంతో బోలెడు నిరాశపడిపోయింది మా ఆవిడ.

నేను మాత్రం 'బ్రతుకు జీవుడా!' అని చిన్నవాడినయినా పెద్దమనసుతో మామయ్యను దీవించాను.

* * *

'ఇంట గెలిచి రచ్చ గెలువు' అన్నది ఓ సామెత.

అపూర్వము, అద్భుతము అయిన తన వంటతో ఇంట గెలిచాననే అనుకుంటున్న మా ఆవిడ..ఇప్పుడు రచ్చగెలిచే ప్రయత్నంలో ఉందని ఆరోజు మా వంటింట్లో మా ఆవిడ దృశ్య, వాగ్రూపాలతో నా కళ్ళకు కట్టించిన ఓ సీన్ చెప్పక చెప్పింది.

ఆ సాయంత్రం-

నేను ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి మా వంట గదిలో నుంచి నేతి, తీపి వాసనలు వీధి గుమ్మంలో నుంచే లోపలికి వస్తున్న నా ముక్కు పుటాలను తాకాయి.

'బోలెడు పంచదార, నెయ్యి పోసి ఇదేదో భారీ వంటకం వండుతున్నట్టుంది. దీని వంటల పిచ్చితో ఆల్రెడీ నేను అప్పుల పాలయ్యాను. ఇంక జోలె పట్టడం ఒక్కటే మిగిలింది' అనుకుంటూ లోపలికెళ్ళి కిచెన్‌లోకి తొంగి చూసాను.

పెళ్ళికో, పేరంటానికో వండుతున్నట్టు అధిక సంఖ్యలో పేపర్ మీద పరిచిన అప్పుడే వండిన అరెసెలు గుండెజల్లుమనేలా నా కంట పడ్డాయి. మూకుడులో ఉడికేవి ఇంకా ఉడుకుతున్నాయి.

"వచ్చారా! మీరు ఎప్పుడు వస్తారా..అరిసె ఎప్పుడు రుచి చూస్తారా అని ఎదురుచూస్తున్నాను. మా అమ్మకు అరిసెలు మెత్తగా ఉంటే ఇష్టం. నాకు క్రిస్పీగా ఉంటే ఇష్టం. ఎలా ఉన్నా దేని రుచి దానిదే. ఎలా ఉందో తిని చెప్పండి" అంటూ చేస్తున్న పనివదిలేసి..లేచి వచ్చి 'నేను ఎక్కడ వద్దంటానో' అని బలవంతంగా ఓ అరిసె నా నోటికి అందించింది.

అది అటు మెత్తగానూ ఇటు క్రిస్పీగానూ లేక లాక్కుని, పీక్కుని తినవలసి రావటంతో దవడలు నొప్పిపెట్టాయి. పైగా నోరంతా దాల్డా కంపు!

"ఎలా ఉన్నాయి?" ప్రశంసల కోసం ఎదురు చూస్తూ ప్రశ్నించింది మా ఆవిడ.

"ఇప్పుడు అరిసెలు ఎందుకు చేస్తున్నట్టు..అదీ ఇంత భారీ ఎత్తున?" అని ఎదురుప్రశ్న వేసాను నేను.

"రేపటి నుంచీ అసెంబ్లీ సమావేశాలున్నాయి కదా మన హైదరాబాద్‌లో" అంది మా ఆవిడ ఠక్కున.

ఆశ్చర్యంతో అదిరిపడ్డాను నేను.

నేను అడిగిన ప్రశ్నకు..తను ఇచ్చిన సమాధానానికి పొంతన ఎక్కడ వుందో నాకు అర్థం కాలేదు.

"అసెంబ్లీ సమావేశానికి..నీ అరిసెలకు ఏమిటి సంబంధం?" అని అడిగాను.

అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు విరామ సమయంలో ఆడ ఎమ్.ఎల్.ఏలు టిఫిన్ బాక్స్‌ల్లో, హాట్‌ప్యాక్‌ల్లో తినే పదార్థాలు అవీ, ఇవీ తెచ్చి మగ ఎమ్.ఎల్.ఏ.లకు మంత్రులకు పెడుతూ ఉంటారు. పేపరులో ఎప్పుడూ చూడలేదూ మీరు? నేను చాలా సార్లు చూసానులెండి. దాంతో నా వంటకం కూడా అసెంబ్లీ దాకా వెళ్ళి, ఆ తరువాత పేపర్లో 'ఎమ్.ఎల్.ఏ మంగతాయారు మేనకోడలు స్వయంగా చేసి తన అత్తతో పంపించిన నేతి అరెసెలను ఆరగిస్తున్న ఎమ్.ఎల్.ఏలు అన్న వార్త ఫోటోతో సహా ప్రింటయితే నాకెంత గర్వంగా ఉంటుంది!' అని వళ్ళు తెలియని పారవశ్యంతో చెప్పుకుంటూ పోతోంది మా ఆవిడ.

ఆవిడ వింత కోరికకు ఓ పక్క విస్తుపోతూనే..మరోపక్క "ఈ మంగతాయారు ఎవరు?" అని అడిగాను.

"అధికార పక్షం ఎమ్.ఎల్.ఏ. మంగతాయారే తెలియదా మీకు? ఆవిడ వరుసకు నాకు అత్తయ్యేగా! నిన్న ఫోన్ చేసి ఈ విషయం చెబితే ఎగిరిగంతేసి 'అరిసెలు పంపించు వెంటనే!' అంది.

"నేను చేసిన అరిసెలు మన సి.ఎమ్.కూడా తినబోతున్నారంటే ఎంత గ్రేటు కదా!" అంది అమృతం మెలికలు తిరిగిపోతూ.

నా గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి ఆ మాటలతో. భయంకరమైన దృశ్యాలు ఒకదానివెంట ఒకటి టీవీ స్క్రీన్‌మీదలా నా కళ్ళముందు గిర్రున తిరిగాయి. 'దంతాలు, దవడల నొప్పితో చెంప పట్టుకుని హాస్పిటల్‌కి పరుగెత్తుతున్న ఎమ్.ఎల్.ఏలు, ఊడిన పళ్ళు, రక్తసిక్తమైన నోటితో హాహాకారాలు చేస్తున్న మంత్రులు, మా ఆవిడ చేతికి బేడీలు వేస్తున్న పోలీసులు...ఇదీ దృశ్యం.

దాంతో "వద్దు..వద్దు" అని కేకలు పెట్టాను నేను గట్టిగా! అవాక్కయిపోయింది మా ఆవిడ.



## విసిగిపోయిన కంగనా

కుర్ర హీరోయిన్ కంగనా రనౌత్ చాలావరకు పాశ్చాత్య మోడల్ దుస్తుల్లోనే కనిపిస్తూ వుంటుంది. కానీ వాటితో ఆమెకి విసుగు కలిగిందిట. అందుకనే ఇప్పుడు తన స్టైయిల్ మార్చింది. ఇప్పుడామె ఏ ఫంక్షన్‌కైనా ఎంచక్కా చీర కట్టుకుని వస్తోంది. అఫ్‌కోర్స్, ఆ చీరలు ఉల్లిపొరల్లాంటి పల్చని చీరలే అనుకోండి. తన 'పర్సనాలిటీ'ని చక్కగా ఎక్స్‌ప్లాయిట్ చేసి ఆకట్టుకునేవి చీరలే అని తనకి అనిపిస్తుంది అంటోందిట కంగనా.